## శ్రీరామ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని శ్రీరామ్ సేవా ట్రస్ట్ చైర్మన్ తోట శ్యాం ప్రసాద్ సూచించారు. స్థానిక అలంకార్ సెంటర్‌లో శ్రీరామ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బంకమట్టి వినాయక విగ్రహాల పంపిణీని ఆయన ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహంకాళి రమేష్, వీళ్లపాటి రమేష్, పోలా నరేష్, రేపాల యాదగిరి, ఓరుగంటి అనిల్, యామా లక్ష్మీనారాయణ, నడిపల్లి ప్రవీణ్, వందనపు రజనీకాంత్, మురారిశెట్టి శ్రీధర్, బూర్లె మధుసూదన్, పోతుగంటి మనోహర్, గుండా శంకర్, పాలవరపు రంగనాథ్, కక్కిరేణి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి భూమిపూజకు ఆర్యవైశ్యులు తరలిరండి



**దశ, సూర్యాపేట ప్రతినిధి :** ఉప్పల్ భగాయత్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల స్థలంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భవన సముదాయాల నిర్మాణానికి ఆదివారం ఉదయం 8 గంటలకు భూమిపూజ నిర్వహించనున్నారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అనంతరం శ్రీనివాస కళ్యాణం, ఆర్యవైశ్య ఆత్మీయత సమ్మేళనం నిర్వహించనున్నారు. సూర్యాపేట నుంచి ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు కోరారు. యువజన, మహిళా, రాజకీయ, విద్యా విభాగాల సభ్యులు తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ (పీవీసీ అధినేత), మీలా మహదేవ్, చల్లా లక్ష్మీకాంత్, గోపారపు రాజు, దేవరశెట్టి సత్యనారాయణ, గుండా వెంకన్న, కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్ రావు, సోమ ప్రవీణ్, గుడిపాటి రమేష్, బొల్లం సురేష్, తోట లక్ష్మీ నరసయ్య తదితరులు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**దశ, హైదరాబాద్ :** గోపాలపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.22 వేల నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపూర్ గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించగా 14 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని గోపాలపూర్ గ్రామానికి చెందిన అనుముల కొండయ్య, అనుముల మల్లారెడ్డి, ముస్కు మురళీకృష్ణ, గోనె మహేందర్, సాయిని అశోక్, సాయిని శ్రీనివాస్, నాగిరెడ్డి శ్రీకాంత్, ఎర్ర కిరణ్, అనుముల వినయ్, ఎర్ర మాధు, షానగొండ చందు, దాడి శ్రీనివాస్, పెంతలమనీ దీప్, పెంతల వంశీగా గుర్తించారు.

# హిందీ జాతీయ భాష అని, దానిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్
- ఘనంగా జాతీయ హిందీ దివస్ వేడుకలు



**దశ, హైదరాబాద్:** హిందీ జాతీయ భాష అని, దానిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సెక్యులర్ దేశమైన భారత్‌లో అన్ని భాషలు, ప్రాంతాలు, కులాలు, మతాలకు సమాన గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో తెలుగుతో పాటు హిందీ, ఉర్దూ భాషలు కూడా విస్తృతంగా వాడుకలో ఉన్నాయని తెలిపారు.

తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన జాతీయ హిందీ దివస్ వేడుకలకు మహేష్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల 'మార్వాడీ గో బ్యాక్' ఉద్యమం జరగడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక వర్గాన్ని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టాలని కోరడం సరికాదని స్పష్టం చేశారు. మార్వాడీలు కూడా తెలంగాణలో అంతర్భాగమేనని పేర్కొన్నారు.

ఇటీవల హిందీ చదివే వారి సంఖ్య తగ్గిపోతుండటం ఆందోళన కలిగించే విషయమన్నారు. హిందీ భాష ప్రచారంతో పాటు, దాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంలో తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు.

హిందీ భాష ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించడంతో పాటు, భాషల మధ్య సోదరభావాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ కొన్నివిచ్చినకార శక్తులు మాటలు, కులాలు, భాష ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నాయని వారితో అప్రమత్తంగా ఉండాలని కోరారు. హిందీ భాష దేశ ప్రజలందరినీ కలుపుతుందని, దీనిని పరిసరక్షించుకోవలసిన ఆవాసముందని అన్నారు. తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చైర్మన్ రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మరియు తెలంగాణ రాష్ట్రంలో హిందీ భాష పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వాలే కృషి చేశాయని గుర్తు చేసారు. వేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో, ప్రపంచ వ్యాపారం మరియు మీడియాలో ఆంగ్లం తరచుగా ఆధిపత్యం చెలాయిస్తున్న తరుణంలో, హిందీ భాషను పరిరక్షించడం మరియు ప్రోత్సహించడం వంటివి ప్రభుత్వాలు చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి. హనుమంత్ రావు, రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కూదానా రెడ్డి, తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు ఖాజా విరహత్ అలీ, తెలంగాణ ప్రదేశ్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ నేతలు రాజేష్ గోయల్, ప్రకాష్ రతి, ప్రదీప్ సూరన, ప్రకాష్ జైన్, హైదరాబాద్ హిందీ జర్నలిస్ట్స్ సొసైటీ అధ్యక్షులు అజయ్ కుమార్ శుక్ల, ప్రధాన కార్యదర్శి ఏం.ఏ. సర్వర్, కార్యదర్శి కన్నయ్య సింగ్, కోశాధికారి రమేష్, కార్యవర్గ సభ్యులు పి.హరికృష్ణ, ఎండి. ముజీబ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందీ భాష పరిరక్షణకు కృషి చేసిన ప్రముఖులు ఋషభ దేవ్ శర్మ కు వినయ్ వీర్ పురస్కారం, దేవ్ కుమార్ పూఖ్రాజ్ కు సదాశివ శర్మ పురస్కారం, మనోహర్ కోశాండర్ కు విద్యారణ్య పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు.

## మట్టి.. మొక్కలు.. ప్రకృతి.. విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు!




**దశ, ఎల్‌బీనగర్:** పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రకృతిని పరిశీలిస్తూ, అనుభవం ద్వారా నేర్చుకునేలా విద్యార్థులు రూపొందించిన వినూత్న ప్రదర్శన ఆకట్టుకుంది. ఎల్‌బీనగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో మట్టి, మొక్కలు, పర్యావరణం, సృజనాత్మకతను మేళవిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "Soil is Nature's Canvas... Every Plant is a Stroke of Beauty" అనే కాన్సెప్ట్‌తో విద్యార్థులు తమ ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రదర్శించారు. మొక్కల పెరుగుదల, మట్టి ప్రాధాన్యత, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని ప్రశ్నలు, పరిశీలన, చర్చల ద్వారా వివరించారు. పుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్ష అనుభవంతో అనుసంధానం చేస్తూ సాగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశీలనా శక్తి, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించింది. 'స్టూడెంట్స్ లెడ్ కాన్ఫిడెన్స్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు సహస్ర రెడ్డి, మోక్షిత రెడ్డి తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రకృతి పరిరక్షణపై సందేశాన్ని అందిస్తూ తమ ఆలోచనలను ధైర్యంగా వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ జగన్మోహన్ రావు, సీఈఓ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ రమణి, ధీరజ్, రాఘవ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## బొగ్గు డిమాండ్‌కు తగ్గట్టు ఓబీ లక్ష్యాలు

- ఓబీ తొలగింపుపై సీఎండీ జ్యోతి దిశానిర్దేశం



**దశ, హైదరాబాద్ :** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గు సరఫరా చేసేందుకు ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాలను పెంచినట్లు సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. సవరించిన లక్ష్యాలను రోజువారీగా సాధించేలా అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, ఆఫ్‌లోడింగ్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.శనివారం సింగరేణి పరిధిలోని 15 ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు చేపడుతున్న 19 ఆఫ్‌లోడింగ్ సంస్థల పనితీరుపై సీఎండీ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో సింగరేణి నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాను పెంచేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. దీనికి అనుగుణంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఓబీ తొలగింపు వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 1,205 లక్షల ఘనపు మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపును లక్ష్యంగా పెట్టుకోగా, 101 శాతం మేర 1,221 లక్షల ఘనపు మీటర్లను తొలగించినట్లు సీఎండీ వెల్లడించారు. అయితే 19 ఆఫ్‌లోడింగ్ సంస్థల్లో ఆగస్టు నెలాఖరు నాటికి ఎనిమిది సంస్థలు మాత్రమే నిర్దేశిత లక్ష్యాలను 100 శాతం సాధించాయని తెలిపారు.

మిగిలిన సంస్థలు కూడా పనితీరును మెరుగుపరుచుకుని లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సెప్టెంబర్‌లో తొలుత రోజుకు 7.28 లక్షల ఘనపు మీటర్ల ఓబీ తొలగింపును లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, పెరుగుతున్న బొగ్గు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దాన్ని 12.1 లక్షల ఘనపు మీటర్లకు పెంచినట్లు జ్యోతి తెలిపారు.

# సెప్టెంబర్ 17 చరిత్రను వక్రీకరించొద్దు!




- "తెలంగాణ విమోచనం–జాతీయవాదుల పాత్ర"
- మేధావుల సదస్సులో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణ విమోచన పోరాటంలో జాతీయవాద సంస్థలు, ప్రజలు పోషించిన పాత్ర చారిత్రాత్మకమని వక్తలు పేర్కొన్నారు. "తెలంగాణ విమోచనం-జాతీయవాదుల పాత్ర" అంశంపై తెలంగాణ విమోచన కమిటీ-బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మేధావుల సదస్సులో మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ఆర్య సమాజ్, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, హిందూ మహాసభ వంటి సంస్థలు నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చాయని అన్నారు. 1998 నుంచే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని బీజేపీ పోరాడిందని, ఆ పోరాట ఫలితంగానే కేంద్రం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ ఓట్ల కోసం సెప్టెంబర్ 17 చరిత్రను వక్రీకరించవద్దని అన్నారు. తెలంగాణ విమోచనం ఏ ఒక్క పార్టీ పోరాటం కాదని, ప్రజలు, రైతులు, మహిళలు, యువత కలిసి చేసిన పోరాటమని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ లిబరేషన్ డేగా నిర్వహిస్తుందని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ బైరాన్‌పల్లి, పరకాల ఘటనలు నాటి దమనకాండకు నిదర్శనమని అన్నారు. డా. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ నిజాం పాలనలో ప్రజలు దోపిడీ, అణచివేతకు గురయ్యారని పేర్కొన్నారు. విమోచన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయడమే లక్ష్యమని తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్‌రెడ్డి తెలిపారు. సదస్సులో మేధావులు, చరిత్రకారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, మాజీ సైనికులు, విద్యార్థులు, జాతీయవాదులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్‌రావు, అశోక్, కమిటీ సభ్యులు బంగారు శృతి, డా. ప్రకాష్‌రెడ్డి, కప్పర ప్రసాద్, కిరణ్ గౌడ్, వెంకట్‌రెడ్డి, సంజయ్ ఘనతే, సందీప్, సాయి, రవీందర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి తూటిపల్లి రవి , కళ్యాణ్ నాయక్, అధికార ప్రతినిధులు డా. సమత, తాడూరి శ్రీనివాస్, సోలంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక బాధ్యత చాటుకున్న డాక్టర్ మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు



- నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థులకు రూ 50 వేల ఆర్థిక సహాయం, పుస్తకాలు అందజేత.

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత 30 సంవత్సరాలుగా నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఎంతోమందికి ప్రాణదానం చేసిన విజయ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ లు మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు తమ సామాజిక బాధ్యతను మరోసారి చాటుకున్నారు. ఇటీవల పెన్పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు భీపంగ యశ్వంత్ నీట్ లో 1301 ర్యాంకు సాధించి ఉస్మానియాలో, మామిడి ఇందు నీట్ లో 10150 ర్యాంకుతో గాంధీ హాస్పిటల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ ఒక్కొక్కరికి రూ :25 వేల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు మొదటి సంవత్సరానికి ఉపయోగపడే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ఉన్నత వైద్య విద్యలో సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వారు ఇరువురు పేదరికంలో ఉన్నారని చదువుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదని ఆలోచనతో తాము ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. సమాజం కూడా స్పందించి వారి వైద్యవిద్యకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో కూడా ఇరువురి విద్యార్థులకు కావలసిన సహాయ సహకారాలను తమ ద్వారా అందజేస్తామన్నారు. డాక్టర్ దంపతుల దాతృత్వం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకొని వైద్యవిద్యను విజయవంతంగా పూర్తి చేసి నిరుపేదలకు వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

# డిగ్రీ 'దండగ కాదు.. పండగ'

❖ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి
❖ అవంతి కళాశాల పట్టభద్రుల దినోత్సవ వేడుకలు ఘనం.



**దశ, హైదరాబాద్:** దేశ జనాభాలో దాదాపు 50 శాతం మంది 26-27 ఏళ్ల లోపు యువతే ఉన్నారని, వారికి నాణ్యమైన విద్యతో పాటు సరైన ఉపాధి మార్గదర్శకత్వం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య వేదికలో శనివారం నిర్వహించిన అవంతి కళాశాల పట్టభద్రుల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆచార్య బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ, యువత విద్యను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని, అందుకే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తూ గ్రాడ్యుయేషన్ స్థాయిలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. 'డిగ్రీ దండగ కాదు.. పండగ' అనే నినాదాన్ని నిజం చేస్తూ, మూడేళ్లు లేదా నాలుగేళ్ల చదువు పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించేలా గత ఏడాది కాలంగా కసరత్తు చేసి సరికొత్త పాఠ్యప్రణాళికను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వినూత్న కోర్సులను అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

రక్షణ రంగం, విమానయానం, విమానాశ్రయాల నిర్వహణ, సముద్ర తీర భద్రత, అంతర్జాల రక్షణ, పర్యావరణ అధ్యయనం, రక్షణ అధ్యయనం వంటి మార్కెట్ ఆధారిత నూతన కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని కళాశాలల్లో భద్రతా అధ్యయనాలు ప్రారంభించామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి విమానయాన, సముద్ర భద్రత, రక్షణ రంగాలకు అవసరమైన నైపుణ్య కోర్సులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని వివరించారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు మానవ వనరులను తీర్చిదిద్దడంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయ డైరెక్టర్ ఆచార్య ఎన్. వెంకటరమణ, అవంతి విద్యా సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. ప్రియాంక, శ్రవణ్ కుమార్, ఎం.వి.ఎస్.ఎస్. నందీశ్, డాక్టర్ వై. జయప్రద, డాక్టర్ శేష తలసాయి, డాక్టర్ ఉమాపతి రెడ్డి, ఆచార్య ఎస్. అప్పారావు, డాక్టర్ బైస స్వాతి, డాక్టర్ బి. రాజ్ కమల్, డాక్టర్ ఎస్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వార్డుల వారీగా అభివృద్ధికి ప్రాధాన్యం

❖ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**దశ, హైదరాబాద్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వార్డును సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్‌చెరు టౌన్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం పటాన్‌చెరు జేపీ కాలనీ, ముత్తంగి డివిజన్ల పరిధిలో రూ.4.6 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు.అనంతరం స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, దేవ్ ప్రైమ్ విలాస్ కాలనీల్లో రక్షిత మంచినీటి సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రతి కాలనీకి స్వచ్ఛమైన, రక్షిత తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సపానదేవ్, శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, కుమార్ గౌడ్, ఈఈ సురేష్, డీఈ కృష్ణవేణి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, వెంకటేష్, సందీప్, రామకృష్ణ, అంజాద్, రవి తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజిద్దాం

❖ ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ

**దశ, ఓయూ:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉన్నతమైన ఆశయంతో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి ఆధ్వర్యంలో తార్నాక గోకుల్ నగర్ లో స ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మరియు నాయకులు మహిళలు, స్థానిక ప్రజలకు మట్టి గణేశుని విగ్రహాలను ఉచితంగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ హితం: రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (PoP) విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై జలచరాలకు, ప్రకృతికి తీవ్ర హాని కలుగుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఈ చవితికి మట్టి విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణ హితంగా పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఉచిత పంపిణీ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విగ్రహాలను ఉత్సాహంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తర్నాకలో బిజెపి ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి: శ్రీరామ్ వెంకట్



**దశ ఓయూ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల నిరంతర ప్రజాసేవకు స్ఫూర్తిగా తర్నాక డివిజన్‌లో 'తార్నాక సేవా-25' కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 20కి పైగా సేవా కార్యక్రమాలను నిర్వహించిన నిర్వాహకులు శనివారం మరో నాలుగు కార్యక్రమాలను చేపట్టారు. అన్నదానం, మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, వినాయక మండపాలకు సహకారం, ప్రజా అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

సేవ అనేది ఒకరోజు కార్యక్రమం కాదని, నిరంతరం కొనసాగాల్సిన బాధ్యత అని అడ్వకేట్ రామచంద్ర కుమారుడు అన్విష్ తెలిపారు. యువత సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే 20కి పైగా కార్యక్రమాలను పూర్తి చేశామని, మరో నాలుగు కార్యక్రమాలతో సేవా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని డా. శ్రీరామ్ వెంకట్ తెలిపారు. 'తర్నాక సేవా-25' ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రజలతో కలిసి నిరంతరం కొనసాగించే సేవా సంకల్పమని పేర్కొన్నారు.మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవ తమకు స్ఫూర్తి అని, అదే స్ఫూర్తితో తర్నాకలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలబడతామని తర్నాక డివిజన్ అధ్యక్షుడు కంటే కరుణాకర్ తెలిపారు. కార్యక్రమాల్లో అడ్వకేట్ శ్రీనివాస్, సుబ్బారావు, కృష్ణ గౌడ్, దేవ, రాధాకృష్ణ, మోహన్, పవన్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. 'తర్నాక కోసం సేవ-ప్రజల కోసం నిరంతర కృషి' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని శ్రీరామ్ వెంకట్ తెలిపారు.

## యాకస్వామి హత్య కేసు ఛేదన

❖ ముగ్గురు నిందితులు అరెస్ట్



**దశ, హైదరాబాద్:** నాగారం మండలంలోని డి.కొత్తపల్లి గ్రామ శివారులో ఎస్ఆర్ఎస్పీ కాలువ రోడ్డుకు సమీపంలో జరిగిన బయ్యం యాకస్వామి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు నాగారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.నాగేశ్వర్‌రావు తెలిపారు. సెప్టెంబర్ 9న సాయంత్రం 5 గంటల సమయంలో డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బయ్యం యాకస్వామి హత్యకు గురయ్యాడు. దీనిపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అనుమానితులపై దృష్టి సారించిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో యాకస్వామికి గతంలో భూమి, ఇంటి విషయాల్లో కొందరితో వివాదాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ వివాదాల నేపథ్యంలోనే అతడిపై దాడి జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభించాయని సీఐ తెలిపారు. ఈ కేసులో బయ్యం నవీన్ (ఏ1), బయ్యం ఆరవపల్లి (ఏ2), బయ్యం ధనమ్మ (ఏ3)లను నిందితులుగా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురూ కలిసి యాకస్వామిపై దాడికి పాల్పడినట్లు దర్యాప్తులో ప్రాథమిక ఆధారాలు లభించాయని తెలిపారు. అరెస్ట్ అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు అందించాలి

అధికారులకు సూచించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**దశ, హైదరాబాద్:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సుధానగర్ బాలుర వసతి గృహంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు ఏర్పాటు చేసిన విచారణ కేంద్రాలతో పాటు కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌ను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత ఓటర్లకు నోటీసులు ఆలస్యం లేకుండా అందించాలని బీఎల్ఓలకు సూచించారు.

మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించాలని, వివరాల్లో వ్యత్యాసాలు ఉంటే నిబంధనల ప్రకారం విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ ఎన్. రవి కూడా వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 182, 184 పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహణను పరిశీలించారు. నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్ల వివరాల పరిశీలనతో పాటు కొత్త ఓటర్ల నమోదు, సవరణలు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియను ఆయన సమీక్షించారు. ఇదిలా ఉండగా, భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను కూడా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన గ్రానైట్ పనులు, పాత్‌వేలు, గ్రీనరీ, లైటింగ్, డ్రైనేజీ పనుల నాణ్యతను పరిశీలించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## బొప్పారంతో దామన్న కు విడదీయరాని అనుబంధం ఆ అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తా

❖ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామంలో ఏలేటి భిక్షం రెడ్డి-మల్లమ్మ జ్ఞాపకార్థం రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొప్పారం గ్రామంతో తన నాన్న మాజీమంత్రి దామన్నకు విడదీయరాని అనుబంధం ఉందని, ఆ అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. సెప్టెంబర్ 14న రాంరెడ్డి దామోదర్ రెడ్డి జయంతిని సేవా దినోత్సవంగా నిర్వహించాలి అని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, పేదలకు సహాయం, తాగునీటి సదుపాయాలు, మొక్కల పెంపకం, విద్యార్థులకు సహాయం వంటి ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జయంతి వేడుకలు సభలు, సమావేశాలకే పరిమితం కాకుండా.. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో నిర్వహించినప్పుడే నిజమైన సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన ఏలేటి ఉపేందర్ రెడ్డి-రేణుక రెడ్డి, వెంకట్ రెడ్డి-గాయత్రి, హర్విక రెడ్డి దాతలను అభినందించారు.

## సంయమనంతో విధులు నిర్వహించాలి

❖ శాంతిభద్రతలను పరిరక్షణలో అలసత్వం వద్దు: ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర

**దశ, హైదరాబాద్:** నిరసనలు, ఆందోళనల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అప్రమత్తంగా, సంయమనంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది అనుసరించాల్సిన విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.హోంగార్డు స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరికీ బందోబస్తు విధులు ఎంతో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా నిరసనలు, ఆందోళనల సమయంలో పరిస్థితులను అంచనా వేసి, ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా వృత్తిపరమైన నైపుణ్యంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును గౌరవిస్తూనే, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పరిస్థితులను సమర్థవంతంగా నియంత్రించడం పోలీసుల బాధ్యత అని తెలిపారు.ఈ సందర్భంగా నిరసనలు, ఆందోళనల సమయంలో పోలీసులు చేయాల్సినవి, చేయకూడని అంశాలను సిబ్బందికి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

❖ దుద్దెడ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



**దశ, హైదరాబాద్:** వరి పంటను కాపాడుకునేందుకు నిరంతరంగా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ దుద్దెడ సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు శనివారం ఆందోళనకు దిగారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని సబ్‌స్టేషన్ ఎదుట రాజీవ్ రహదారిపై రైతులు ధర్నా నిర్వహించారు. అంకిరెడ్డిపల్లి, బంధారం, దర్గా, దుద్దెడ, రాంపల్లి, మర్పడగ తదితర గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో వరి సాగుకు రోజుకు 14 గంటలపాటు విద్యుత్ సరఫరా చేసేవారని తెలిపారు. ప్రస్తుతం సరఫరాను 10 గంటలకే పరిమితం చేయడంతో పొలాలకు సకాలంలో నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు కోసం ఇప్పటికే పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి అప్పులు చేశామని, విద్యుత్ కోతలు కొనసాగితే పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.హుస్నాబాద్ డివిజన్‌లోని ఇతర ప్రాంతాలకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నప్పుడు తమ ప్రాంత రైతుల పట్ల కూడా అదే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కీలక దశలో ఉన్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. తమ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించి, పంటలకు అవసరమైన మేర విద్యుత్ అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, సీనియర్ నాయకుడు ర్యాగల దుర్గయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు నీల సత్యం మద్దతు తెలిపారు. రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న కొండపాక ఏఈ సత్యం రైతులతో మాట్లాడారు. వారి సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి 12 గంటల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందజేసి ధర్నాను విరమించారు.